
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 నవంబర్ 2024
5
తిరుపతి



ఎయిర్‌పోర్టులో ఆక్టోపస్ మాక్ ఆపరేషన్



ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఆక్టోపస్, పోలీస్ దళాలు శనివారం వేకువజామున రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో మాక్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్ అర్ధరాత్రి ప్రారంభమై ఉదయం వరకు కొనసాగింది. అనుకోని విధంగా ఎదైనా తీవ్రమైన ఘటనలు లేదా ఉగ్రమూకలు దాడికి పాల్పడితే సిబ్బంది, ప్రయాణికులు, సందర్శకులు ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియ జేసేందుకు ఆక్టోపస్ దళాలు తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు పోలీస్ యంత్రాంగం, రెవెన్యూ అధికారులు, ఫైర్ సర్వీసు, మెడికల్ డిపార్ట్మెంట్ వారు కలసి సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు.

సాగు భూమికి పట్టాలివ్వాలంటూ...

సెల్ టవర్ ఎక్కిన దళిత రైతులు



ప్రజాశక్తి - కెవిబిపురం

సాగుభూమికి పట్టాలివ్వాలంటూ కెవిబిపురం మండలం కళత్తూరు దళితవాడ రైతులు సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చెట్టు పుట్ట కొట్టి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలంటూ డిమాండ్ చేశారు. ఫారెస్టు ల్యాండ్‌కు ఆనుకుని వంద ఎకరాల రెవెన్యూ భూమి ఉంది. ఆ భూమిలో చెట్టుపుట్ట కొట్టి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారు. తమ అధీనంలోని భూములకు పట్టాలివ్వాలంటూ ఏళ్ల తరబడి నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. అప్పట్లో స్థానిక ఎంఎల్ఎ, ఎంపి గ్రామానికి చేరుకుని ఫారెస్టు వారితో మాట్లాడి దళితుల జోలికి వెళ్లొద్దని చెప్పడంతో సద్దుమణిగింది. అప్పటినుంచి దళితులు ఆ పొలాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఫారెస్టు రేంజి అధికారి రాధికారెడ్డి ఆ భూములన్నీ ఫారెస్టు, రెవెన్యూకు సంబంధించినవని, సాగు చేయరాదని, ఒకవేళ ధిక్కరిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో దళితులు తమకు జీవనాధారమైన భూములే లేనపుడు తమకు ఈ ప్రాణాలు వద్దంటూ శనివారం రైతులు సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని వారిని కాపాడే ప్రయత్నం చేశారు. అయినా వారి మాటను దళిత రైతులు పట్టించుకోకపోవడంతో పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో, సిఐ, అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని టవర్‌పై ఉనన దళితులకు నచ్చజెప్పి కిందకు దింపారు.

ఈ సందర్భంగా కళత్తూరు గ్రామానికి చెందిన నాగరాజ్ మాట్లాడుతూ కళత్తూరు రెవిన్యూ బ్లాక్ నెంబర్ 4 లో 2500 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందని, అయితే ఈ భూమిలో తమ తాతలు కాలం నుంచి సాగు చేస్తున్నామన్నారు. అయితే ఇప్పుడు ఫారెస్ట్ అధికారులు ఈ భూమి ఫారెస్ట్, రెవెన్యూకు చెందుతుందని, ఇందులో ఎవరు దిగడానికి వీలులేదని దళితులను భయాందోళనలకు గురి చేస్తున్నారన్నారు. తామంతా ఈ భూమిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, ఫారెస్ట్ అధికారుల నుంచి తమ భూములు తమకు వచ్చేలా ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. లేకుంటే తమకు చావే శరణ్యమని వాపోయారు.

సప్తవర్ణ శోభితం...శ్రీవారి పుష్పయాగం

ప్రజాశక్తి -తిరుమల

కార్తీకమాసంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. సువాసనలు వెదజల్లే 17 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. రంగురంగుల పుష్పాలు, పత్రాల మధ్య స్వామి, అమ్మవార్ల వైభవం మరింత ఇనుమడించింది. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను పట్టు వస్త్రా భరణాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ పుష్పకైంకర్యం చేశారు. చామంతి, సంపంగి, నూరు వరహాలు, రోజా, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, కలువ, మొగలిరేకులు, మానసంపంగి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదిరిపచ్చ పత్రాలతో స్వామి, అమ్మవార్లను అర్చించారు. ఈ సందర్భంగా వేదపండితులు రుగ్వేదం, శుక్లయజుర్వేదం, కష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలను పఠించారు.





ఉద్యానవన డిప్యూటీ డైరెక్టర్‌కు సన్మానం

శ్రీవారి పుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించేందుకు దాతల నుంచి పుష్పాలు సేకరించేందుకు కషి చేసిన టీటీడీ ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులును ఆలయ అధికారులు శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామకష్ణ పాల్గొన్నారు. తమిళనాడు నుంచి ఐదు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఆంధ్రప్రదేశ్ నుండి రెండు టన్నులు కలిపి మొత్తం 9 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించారని వెల్లడించారు.

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పుష్పయాగ మహోత్సవం వేడుకగా జరిగింది. 12 రకాల పుష్పాలు, ఆరు రకాల ఆకులతోన ఇవేదన నిర్వహించారు. పుష్పయాగానికి సుమారు 3 టన్నుల పుష్పాలను వినియోగించారు. ఈ పుష్పయాగ మహోత్సవంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి దంపతులతో పాటు గ్రామస్తులు, స్వామి వారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎక్కడైనా దేవుని విగ్రహం కన్పిస్తే భక్తులు ఆధ్యాత్మిక చింతన లోకి వెళతారు. ఈ భక్తుల విశ్వాసమే రాజకీయ నాయకులకు వరమయ్యింది. కొంతమంది రాజకీయ నేతలు ప్రజల విశ్వాసాన్ని కబ్జాకు పావుగా మలచుకుంటున్నారు. కోట్ల రూపాయల విలువ చేసే తుడా భూమిని కొట్టేసేందుకు రాజకీయ పార్టీ నేతలు దేవుని ప్రతిమను వాడుకుంటున్నారు. తమ భూదాహానికి అడ్డూ అదుపూ లేదని చాటుతున్నారు.

ఎంచక్కా 'తుడ' భూమి 'కబ్జా'

- గుడి పేరుతో నిర్మాణం
- అధికార పార్టీ నేతల హస్తం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయడంపై అధికార పార్టీ కూటమి నేతలు దష్టి పెట్టారు. తిరుపతి వంటి నగరంలో భూముల విలువలు ఎక్కువగా ఉండడంతో ప్రభుత్వ భూమి ఎక్కడ కనబడితే అక్కడ కబ్జా చేసి పాగా వేసేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వానికి సంబంధించిన రాజకీయ నేతలు ప్రభుత్వ భూములపై కన్నేస్తున్నారు. ఎక్కడ ఏ చిన్న స్థలం కనబడినా రాత్రికి రాత్రి షెడ్డులు నిర్మించి, విద్యుత్ కనెక్షన్లు తీసుకొని రెవెన్యూ, తుడా అధికారులను బెదిరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ యంత్రాంగం అధికార పార్టీ నేతల ఒత్తిడికి తగ్గాల్సి వస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సర్వేనెంబర్ 176/2 లో తుడా భూమి ఉంది. దీన్ని అధికారులు ఒక ప్రైవేటు వ్యక్తికి వాటర్ ట్యాంక్ నడపడానికి లీజుకి ఇచ్చారు అయితే ఆ వ్యక్తిని ఆ స్థలంలోకి వెళ్ళనీకుండా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో భూమిని స్థానికులు చదును చేసి ప్లాట్లుగా వేసుకోవడానికి ప్రయత్నిస్తే తుడా అధికారులు అడ్డుకున్నారు. తుడ వైస్ చైర్మన్ మౌర్య ఈ స్థలం కబ్జాపై ఉక్కు పాదం మోపడానికి సిద్ధమయ్యారు. స్థలాలు కబ్జా చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని తుడా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



రూ.25 కోట్ల పైమాటే...

తిరుపతి- కరకంబాడి ప్రధాన మార్గాన్ని ఆనుకుని మంగళం వద్ద తుడాకు రూ.25 కోట్ల విలువైన సుమారు రెండు ఎకరాల భూమి ఉంది. ఇక్కడ తుడాకు చెందిన కుండీలను గతంలో నిల్వ ఉంచారు. దీన్ని కబ్జా చేసేందుకు రాజకీయ నేతలు ప్రణాళిక రచించుకున్నారు. మొదట ఒక దిమ్మెపై చిన్న విఘ్నేశ్వరుని విగ్రహాన్ని ఉంచారు. దాని చుట్టూ గుడి నిర్మించేందుకు సిమెంటు ఇటుకలు సిద్ధం చేసుకున్నారు. గుడి పనులు పూర్తయిన తర్వాత మిగిలిన భూమిని తమ కబ్జాలోకి తెచ్చుకునేందుకు చూస్తున్నారు. రెండు మూడు రోజుల్లో పనులు చేసేందుకు సిద్ధ మయ్యారు. అక్కడ రహదారికి ఆనుకుని ఒక చిన్న ఆలయం ఉండగా.. కబ్జా చేసేందుకు వినాయకుడి పేరిట నిర్మాణాలు చేసేందుకు ఆ స్థలంలో ఉన్న మొక్కలు తొలగించి, చదును చేశారు. చుట్టూ పర దాలు కట్టారు. ఫెన్సింగ్ వేసేందుకు తవ్వకాలు చేపట్టారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పట్టించుకోవద్దని తుడా అధికారులకు ఒక నేత చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు సైతం వెనుకాడుతున్నారు. నోటిఫికేషన్ వెలువడితే అంతా ఎన్నికల అంశాలపై దష్టిసారిస్తారని ఆ సమయంలో స్థలాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు రాజకీయ నేతలు యత్నాలు చేస్తున్నారు. ఎన్నికలు ముగిసే సమయానికి ప్రభుత్వ, తుడా భూములను కబ్జా చేసేందుకు రాజకీయ నాయకులు బరితెగించారు.

తుడ స్థలం కబ్జా చేస్తే చర్యలు : వీసీ మౌర్య

తుడ స్థలాలు కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ఎన్ మౌర్య హెచ్చరించారు. తుడా ఆధీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాల అభివద్ధికి తుడ కషి చేస్తుందని, అలాంటి స్థలాలను రాజకీయ నేతలు పేదలను ఉసిగొల్పి స్వాధీనం చేసుకుంటే ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇకనైనా తుడా స్థలాల జోలికి రాకపోతే మంచిదని హెచ్చరించారు.

'రిగ్గు' ట్రాక్టరు సీజ్

కొండ కబ్జా...రహదారి దర్జా..!

ప్రజాశక్తి - రామచంద్రాపురం

మండలంలోని సి. రామాపురంలోని అక్క గార్ల గుడికి ఎదురుగా ఉన్న కొండను రిగ్గు యంత్రాలతో పిండి చేసి కబ్జా చేసేందుకు కబ్జాదారులు కన్నేశారు. చుట్టుగుంట రామాపురం రెవెన్యూ లెక్క దాఖలాలలోని సర్వే నెంబరు 28 కొండ ప్రాంతం. ఆ కొండ ప్రాంతాన్ని కబ్జాదారులు కబ్జా చేసేందుకు రాత్రి వేళల్లో రిగ్గు బండ్లతో రంధ్రాలు పెట్టి, పేలుడు పదార్థాలతో పేల్చి బండరాలను పిండి చేసి దారి ఏర్పాటు చేస్తున్నారు. ఈ కొండ ప్రాంతం తిరుపతికి సమీపంలో ఉండడంతో భూములు రేట్లు విలువ పెరగడం కారణంగా కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్మేందుకు మొదట రహదారి ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలోని శుక్రవారం రాత్రి రిగ్గు బండితో బండరాళ్లను పగలగొట్టేందుకు రంధ్రాలు పెడుతుండగా ఆర్‌సిపురం పోలీసులు గుర్తించి, ప్రభుత్వ భూములలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎలా...? రిగ్గు యంత్రాలను పెట్టి బంద్రాలను పగలగొడతారని...... రహదారి ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించి టిఎన్ 51 ఏకే 9852 రిగ్గు టాక్టర్ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ వ్యవహారంపై ఎస్ఐ రామాంజనేయులు వివరణ కోరగా విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు.



కొండను పిండిచేసి ఆక్రమణల్లో భాగంగా రహదారి ఏర్పాటు

డిసెంబర్లో లక్ష మందికి ఇళ్లు

పీఎంఏవై 1.0లో 50 శాతం ఇళ్ల నిర్మాణాలు
హౌసింగ్ శాఖ అక్రమాలపై విచారణ
మీడియా సమావేశంలో మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



ప్రధానమంత్రి ఆవాజ్ యోజన 1.0 ద్వారా చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో హౌసింగ్ శాఖ ద్వారా 50 శాతం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశామని, డిసెంబర్లో కూటమి ప్రభుత్వం ఏర్పడి 200 రోజులు దాటుతున్న సందర్భంగా లక్ష మంది హౌసింగ్ లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను ఇచ్చేలా నిర్ణయించామని ఆంధ్రప్రదేశ్ గహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శనివారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో విలేకరుల సమావేశంలో మంత్రి పలు విషయాలను మీడియాకు వివరించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పీఎంఏవై 1.0లో ఇసుక కొరత కారణంగా పూర్తిస్థాయిలో నిర్మాణాలు జరగలేదన్నారు. దీనిపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇసుక కొరత లేకుండా హౌసింగ్ లేఔట్లకు నేరుగా ఇసుకను రవాణా చేసుకునేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇందుకుగాను ఇసుక రవాణాకు సంబంధించిన బిల్లులను హౌసింగ్ శాఖ ద్వారా చెల్లించే విధంగా ఆదేశాలు ఇచ్చామన్నారు. కుప్పంలో విద్యుత్ శాఖ, రెస్కో సొసైటీ మధ్య ఉన్న సమాలోచన లోపంతో అక్కడ విద్యుత్ మీటర్లను ఇంకనూ బిగించాల్సి ఉందన్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం పెంపొందించడానికి సబ్ స్టేషన్లను నిర్మించనున్నామన్నారు. హౌసింగ్ లేఔట్లలో మౌలిక వసతుల కల్పనను గత వైసిపి ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తించామన్నారు. మౌలిక వసతుల కల్పన కోసం నరేగా నిధులతో హౌసింగ్ కాలనీలలో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల చొరవతో సిసి రోడ్లు వేసేలా నిర్ణయించామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో అయితే అమత్ పథక నిధులను వినియోగించనున్నామన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకొని 15 రోజులలో బిల్లు పెడితే మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో ఆ బిల్లులను హౌసింగ్ శాఖ చెల్లిస్తుందన్నారు. అలా చెల్లింపులు జరగకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇల్లు నిర్మించుకోకుండానే బిల్లులు పొందినట్టుగా ఆరోపణలు ఉన్నాయని, దీనిపై కూడా సమగ్ర విచారణ చేయిస్తామన్నారు. మార్చి తరువాత ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0ను ప్రారంభిస్తామన్నారు. ప్రతి ఒక్కరి సొంత ఇంటి కల నిజం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి రాష్ట్రంలో ప్రతి గ్రామంలో సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించి వారికి పక్కా ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లను పక్కన పెట్టేసారన్నారు. ఇక్కడ ఇంకో మోసానికి జగన్ ప్రభుత్వం తెరలేపిందన్నారు. లబ్ధిదారుల పేరుపై ప్రభుత్వమే రుణాలు పొంది, ఆ నిధులను దేనికి ఖర్చు చేశారో కూడా తెలియని పరిస్థితులు ఏర్పడ్డాయని, త్వరలో నూతన అక్రిడియేషన్ పాలసీని అందుబాటులోకి తీసుకువచ్చి అర్హులైన జర్నలిస్టులు అందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి జర్నలిస్టులకు అందించాలని ముఖ్యమంత్రి ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, వెంకటగిరి ఎమ్మెల్యే రామకష్ణ, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయ శ్రీ, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫస్ట్ ఓపెన్ సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ పోటీలను శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు ముఖ్య అతిథిగా హాజరై శనివారం ప్రారంభించారు. ఏపీలో క్రీడారంగానికి పూర్వ వైభవం వస్తుందన్నారు. క్రీడారంగం కార్పొరేట్ కంపెనీలకు దాసోహం కాదని, రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉన్న కోర్టులను డిఎస్ఎల ఆధీనంలోకి తీసుకుంటాం అన్నారు. తిరుపతి వేదికగా ఏడు రాష్ట్రాలతో ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడా వేదికగా తిరుపతిని తీర్చిదిద్దుతామని, త్వరలో తిరుపతి శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సుకు మహర్దశ రానుందన్నారు. ఇండోర్ హాలు, మల్టీపర్పస్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాకల అభివద్ధికి కషి చేస్తామన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 2027లో ఏపీలో నేషనల్స్ గేమ్స్ నిర్వహించేలా సీఎం ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్స్ జిల్లా అధ్యక్షులు వై ప్రవీణ్, ఈశ్వర్ ప్రసాద్, నరసింహ యాదవ్, నవాబ్ సాహెబ్, మబ్బు దేవనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

గూడూరు ప్రాంత సిపిఎం కార్యదర్శిగా జోగి శివకుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు నియోజకవర్గ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శిగా జోగి శివకుమార్ ఎన్నికయ్యారు. గూడూరు కార్యాలయంలో సిపిఎం ప్రాంత మహాసభ జరిగింది. సిపిఎం జిల్లాకార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కమిటీ సభ్యులుగా శ్రీనివాసులు ,సురేష్, గుర్రం రమణయ్య, హరినాథ్, ముత్యాలయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు యాదగిరి, పామంజి మణి, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు పుట్ట శంకరయ్య పాల్గొన్నారు. అనంతరం 'ప్రజాపోరు' పోస్టర్లను నేతలు ఆవిష్కరించారు.



గూడూరులో ప్రజాపోరు పోస్టర్ ఆవిష్కరణ

'సూపర్‌సిక్స్'పై నిలదీయండి

పుత్తూరు టౌన్ : టిడిపి కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సూపర్‌సిక్స్ అమలుపై నిలదీయాలని సిపిఎం డివిజన్ కార్యదర్శి ఆర్.వెంకటేష్ అన్నారు. అంబేద్కర్ సర్కిల్ నుంచి పెట్రోల్ బంక్ వరకూ 'ప్రజాపోరు' కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా హామీల అమలుపై చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పి.భాస్కర్, వై.నందయ్య, మునిశంకర్, ఎ.విజయ్, యాషన్‌బాష పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి : ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారంటూ కూటమి నేతలను నిలదీయాలని సీపీఎం నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజాపోరులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్టీకే నగర్ లో ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, వెంకటేష్ లు పర్యటించి ప్రజాపోరు కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అదేవిధంగా తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి, కంచనపల్లి గ్రామాల్లో సీపీఎం నేతలు పెనగడం గురవయ్య, గెడి వేణు, గురునాధం పర్యటించారు. విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలు రద్దు, ఉచిత ఇసుక అమలు, నిత్యావసర ధరల తగ్గింపు ఎప్పుడు చేస్తారని కూటమి నేతలను నిలదీయాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఎర్ర జెండా ప్రజలకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

టిటిడిలో కొలువుదీరిన కొత్త కమిటీ...!

ప్రజాదృష్టి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఎట్టకేలకు ఐదు నెలలు ఆలస్యంగా నైనా టిటిడికి కొత్త పాలక మండలిని కూటమి ప్రభుత్వం నియమించింది. ఆంధ్రప్రదేశ్ నుంచే కాక సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సైతం సభ్యులను ఎంపిక చేశారు. 24 మంది సభ్యులతో కూడిన పాలకమండలి రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించింది. కానీ పాలకమండలి ముందున్న పలు సమస్యలు పరిష్కరించడంలోనే వారికి నిజమైన పరీక్ష.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచ ప్రసిద్దిగాంచిన ఆధ్యాత్మిక కేంద్రం. ఇక్కడికి దేశ విదేశాల నుంచి ప్రతి రోజూ లక్షలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ధర్మాన్ని రక్షించండి ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందనే నినాదంతో ముందుకెళ్లే టిటిడి ప్రపంచ వ్యాప్తంగా శ్రీవారి వైభవాన్ని ప్రచారం చేసేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. అందులో టిటిడి పాలకమండలి కృషి, నిర్ణయాలు కీలకం. ఇటీవల కాలంలో తిరుమల శ్రీవారి లడ్డుపై పెద్ద దూమరమే రేగింది. రాష్ట్ర పాలకులే దీనిపై విమర్శలు చేయడంతో సాక్షాత్తు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టే స్వయంగా స్పందించి దీనిపై ప్రత్యేకంగా సిబిఐ విచారణకు ఆదేంచిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో 24 మంది సభ్యులతో కూడిన కొత్త పాలకవర్గం ఈ నెల 6వ తేది తిరుమల వేదికగా ప్రమాణస్వీకారం చేపట్టింది. పాలకమండలి అద్యక్షులుగా ఓ ప్రముఖ ప్రచార మాధ్యమానికి చెందిన అధినేతన నియమించారు. మొదటి రోజు 18 మంది ప్రమాణస్వీకారం చేయగా, రెండో రోజు ముగ్గరు, మూడో రోజు మరో ముగ్గరు సభ్యులు కలిసి ప్రమాణస్వీకారాన్ని పూర్తి చేశారు. పాలకమండలి అధ్యక్షులుగా నియమించబడిన బిఆర్ నాయుడు అప్పడే తన పంచ లక్ష్యాలను వెల్లడించారు. టిటిడిలో అన్యమత ఉద్యోగులకు అవకాశం ఇవ్వడం సరైనది కాదని వెల్లడించారు. పారిశుద్యానికి పెద్ద పీత వేస్తానని తెలిపారు. అందులో భాగంగా ప్రమాణస్వీకారం చేసిన మరుసటి రోజే ..24 గంటలు గడవకముందే జోరున వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తిరుమలలో నిల్వ చేసిన వ్యర్థాల ప్రాంతాన్ని పరిశీలించి, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో వాటిపై నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. తిరుమల శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు ఎలాంటి కృషి చేస్తారు. సామాన్య భక్తులకు సౌకర్యాల కల్పనలో, శ్రీవారి దర్శనాన్ని కల్పించడంలో, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారో...పెండింగ్‌లో ఉన్న పలు నిర్మాణ పనులు వకుళమాత ఆలయం రోడ్డు, తిరుచానూరు పుష్కరణి వద్ద నూతన భవనాల నిర్మాణం, శ్రీవారి మెట్టు వ్యాపారుల సమస్య, అటవీకార్మికుల సమస్య, పారిశుద్ధ్య కార్మికుల సమస్యల ఇలా అనేక సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం చొరవ చూపుతారో వేచి చూద్దాం.

వాటర్‌స్పోర్ట్స్ హబ్‌గా రాయలచెరువు

రామచంద్రాపురం : రాయలచెరువు ప్రాంతాన్ని పర్యాటక, వాటర్‌స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని చంద్రగిరి ఎంఎల్ఎ నాని, శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు. శనివారం రాయలచెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. గత టిడిపి ప్రభుత్వంలో ర్యాపిడ్ స్పోర్ట్స్ సంస్థ ద్వారా రాయలచెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఒప్పందం చేసుకున్నామని, వైసిపి హయాంలో ఆ సంస్థ పారిపోయేలా చేసిందన్నారు. రాయలచెరువును రూ.350 కోట్లతో ప్రాజెక్టుగా తీర్చిదిద్దుతామన్నారు. శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు మాట్లాడుతూ ర్యాపిడ్‌స్పోర్ట్స్ సంస్థ అధికారులతో చర్చించి అంతర్జాతీయ క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం రాయలచెరువులో వీరు బోట్‌షికార్ చేశారు. ఈ బోట్‌లో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ జి.నరసింహయాదవ్, మేకల తిరుమలరెడ్డి ఉన్నారు.



రాయలచెరువులో బోట్ షికార్...

నేడు బిఎస్ఎన్ఎల్ మేళా

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ రూరల్, సత్యవేడు రూరల్ మండలాల ప్రజల సౌకర్యార్థం బిఎస్ఎన్ఎల్ సిమ్కార్డ్ వినియోగదారుల సౌకర్యార్థం బిఎస్ఎన్ఎల్ ఫ్రీ సిమ్ మేళా ఆది వారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు బిఎస్ఎన్ఎల్ అధికారి వీరాస్వామిలు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ 3జి సిమ్ నుండి 4జి సిమ్కు మారడానికి, బిఎస్ఎన్ఎల్ కొత్త సిమ్లు తీసుకోవడానికి, ఇతర నెట్వర్కుల నుండి బిఎస్ఎన్ఎల్కు మారడానికి పరిసర ప్రజల సౌకర్యార్థం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరదయ్యపాలెంలో పోస్ట్ ఆఫీస్ పక్కన బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద, బుచ్చినాయుడు కండ్రిగ ఆర్టిసి బస్టాండ్ సమీపంలో ఈ మేళా నిర్వహిస్తామని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బిఎస్ఎన్ఎల్ అధికారులు కోరారు.

మాజీ మంత్రి పరసాకు పరామర్శ


మాజీ మంత్రి పరసా రత్నంను పరామర్శిస్తున్న రఫీ

ప్రజాశక్తి-నాయుడుపేట: మాజీ మంత్రి ,మార్కెఫెడ్ డైరెక్టర్ పరసావెంకట రత్నయ్యను నాయుడుపేట మండలం గొట్టిప్రోలు గ్రామంలోని ఆయన స్వగ్రామం లో నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ శనివారం పరామర్శించారు. ఇటీవల ఆయన గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పరసా వెంకటరత్నయ్య ఇంటికి నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ కొంతమంది టిడిపి నాయకులతో కలిసి ఆయనను పరామర్శించారు. ఆయన ఆరోగ్యం మెరుగుపడి త్వరగా కోలుకుని తిరిగి ప్రజా క్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. రఫీతో పాటు టిడిపి నాయకులు ఖలీల్ బాష, లాయర్ చంగయ్య, అర్జున్ రాజు ఉన్నారు.

వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ప్రజల నుండి శనివారం వినతులు స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి త్వరిత గతిన సమస్యను పరిష్కరించాలని తెలిపారు.

ఏర్పేడు మండల యూటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆమందూరు ఆవరణ లో మండల యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి ఓ విజయకుమార్ వ్యవహరించారు. అధ్యక్షులుగా సి గురవారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వి రామకృష్ణయ్య, గౌరవ అధ్యక్షులుగా ఎం భక్తవత్సలం, సహాధ్యక్షులుగా ఎన్ మునిరత్నం, ఎం ఉష, ఆర్థిక కార్యదర్శిగా ఎం ఎంశాంతి, జిల్లా కౌన్సిలర్లుగా ఎ నాగరాజు, జి సుధాకర్, జి సీతాపతి, ఎ హరినాథ్ బాబు, ఎం పద్మ, వైగురవారెడ్డి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, యూటీఎఫ్ లక్ష్యాల కోసం నూతన కమిటీ పని చేస్తుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్ఛార్జి, జిల్లా కార్యదర్శి మోహన్ బాబు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.శివకుమార్, కుటుంబ సంక్షేమ సంఘం డైరెక్టర్ హేమాంబరధర రావు, సీనియర్ నాయకులు రాజవేలు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు నమోదు సవరణ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మున్సిపల్ పరిధిలో చేపట్టిన ఓటరు నమోదు సవరణ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పుత్తూరు మున్సిపల్ పరిధిలోని అన్నీ పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరి రివిజన్ అఫ్ డేట్ కోసం ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటరు నమోదు, సవరణ చేయడానికి బూత్ లెవల్ అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. అందులో భాగంగా శనివారం పట్టణంలోని కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవడాన్ని, ఓటర్ల తొలిగింపు, సవరణ కోసం అర్జీలు స్వీకరించే కార్యక్రమాన్ని చేపట్టిన అన్నీ పోలింగ్ కేంద్రాలను కమిషనర్ తనిఖీ చేసి బూత్ లెవల్ అధికారులకు కమిషనర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

డీబీఆర్ సంస్థల అధినేత భక్తవత్సలరెడ్డి మృతి


నివాళులర్పిస్తున్న బొజ్జల బృందమ్మ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ : టీడీపీ సీనియర్ నేత, డీబీఆర్ సంస్థల అధినేత దందోలు భక్తవత్సల రెడ్డి శనివారం అనారోగ్యం కారణంగా శనివారంమృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మండలంలోని తొండమాన్ పురంలో సందర్శనకు ఉంచారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి తల్లి బృందమ్మ, సతీమణి రిషితారెడ్డి భక్తవత్సలరెడ్డి మృతదేహానికి నివాళి అర్పించారు. శ్రీకాళహస్తి టీడీపీ కుటుంబం గొప్ప నాయకుడిని కోల్పోయిందని బొజ్జల బృందమ్మ అన్నారు.

శాతవాహన విశ్వవిద్యాలయం విసికి సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అతిథి గృహానికి విచ్చేసిన శాతవాహన విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య యు ఉమేష్ కుమార్ను ఏబీఆర్ఎస్ఎం ఆంధ్రప్రదేశ్ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి, మంజులతో కలిసి శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో ఆయన చేసిన విశేష కృషికి ఈ గౌరవం, గుర్తింపు రావడం ఎంతో ఆనందదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ట్రెజర్ ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్, డాక్టరు ఎన్ బాలసుబ్రహ్మణ్యం, డాక్టరు వి మంజునాథ్ పాల్గొన్నారు.


విసి ఉమేష్కుమార్ను సన్మానిస్తున్న ఎపిఆర్ఎస్ఎం రాష్ట్ర నాయకులు

క్లిష్టమైన శస్త్ర చికిత్స విజయవంతం


శస్త్ర చికిత్స అనంతరం కోలుకున్న రోగితో వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని శ్రీ మారుతి హాస్పిటల్లో క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి రోగి ప్రాణాలను కాపాడమని హాస్పిటల్ ఎండీ మారుతి కృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన 65 ఏళ్ల రోగి ఊపిరితిత్తుల విభాగానికి వైద్యం కోసం వచ్చారన్నారు. అంతర్జాతీయ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎంపీ నరసింహ రోగిని పరీక్షించి ఛాతి మధ్య భాగంలో పెద్ద క్యాన్సర్ గడ్డ ఉన్నట్లు నిర్ధారించారన్నారు. తదుపరి సి టీ వి ఎస్ సర్జన్, అనస్తీసియా డాక్టర్ మహేష్ సహకారంతో చాకచక్యంగా శస్త్ర చికిత్సను నిర్వహించి క్యాన్సర్ గడ్డను బయటకు తీశారన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యం పూర్తిగా మెరుగుపడటంతో వైద్యులతో సహా, రోగి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారన్నారు. మారుతి కృష్ణ మాట్లాడుతూ ఇటువంటి క్లిష్టమైన శస్త్ర చికిత్సల కోసం మునుపు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేదని, తిరుపతిలో అధునాతన టెక్నాలజీతో మారుతి హాస్పిటల్ లో ఇటువంటి క్లిష్టమైన శస్త్ర చికిత్సలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ తేజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి ఘన సన్మానం


మంత్రిని సన్మానిస్తున్న అన్నా అనిత యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారధిని తిరుపతి నగరపాలక సంస్థ 48వ డివిజన్ కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, 49వ డివిజన్ కార్పొరేటర్ అన్నా సంధ్య యాదవ్, రాజీవ్ నగర్ పంచాయతీ మాజీ సర్పంచి అన్నా రామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్పీ చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, కొర్లగుంట ముని, ఉదయ్ యాదవ్ పాల్గొన్నారు.

మారని రేషన్ మాఫియా తీరు!

- గుట్టు చప్పుడు కాకుండా బియ్యం తరలిస్తున్నారని ఆరోపణలు - అధికారులే కళ్లు తెరవాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వం మారుతునే అజ్ఞాతంలో వెళ్లిన ఈ రేషన్ మాఫియా మరలా రూపం మార్చి తిరిగి మెల్లమెల్లగా రహస్యంగా తమ అక్రమ కార్యకలాపాలను గుట్టు చప్పుడు కాకుండా ప్రారంభిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో విచ్చలవిడిగా గత ఐదు సంవత్సరాలలో యథేచ్ఛగా అక్రమ రవాణాకు పాల్పడ్డ ఈ మాఫియా మళ్లీ తమ కార్యకలాపాలను ప్రారంభించి నియోజకవర్గంలో గుట్టు చప్పుడు కాకుండా రేషన్ బియ్యం రాష్ట్రం ఎల్లలు దాటిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు స్పందించాల్సి వుంది.

మళ్లీ రేషన్ బియ్యం అక్రమ తరలింపు?

సత్యవేడు నియోజకవర్గంలో ఇద్దరు చోట్యా ముసుగులో ఓ మూడా మాఫియా నాయకుడు రేషన్ బియ్యం సేకరించి పాలిష్ చేసి గతంలో సరిహద్దు దాటిస్తున్న పరిస్థితి ఉండేది.. మరి ఇప్పుడు..సంబంధిత అధికారులే తేల్చాలి. నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాలెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలలో ఎన్నుకున్న పేద ప్రజల గ్రామీణ ప్రాంతాలలో తమ ఏజెంట్లను ఏర్పాటు చేసి రేషన్ బియ్యాన్ని సేకరించి పాలిష్ చేసే మరలా తమ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభిం చినట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులు నిఘా వుంచి నిగ్గు తేల్చాలి వుంది.

ఈ మాఫియా వరదయ్యపాలెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలలో తమ ఏజెంట్లను రహస్యంగా ఏర్పాటు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా గతంలో తరలిస్తున్నట్లు సమాచారం.. ప్రస్తుతం మళ్లీ రంగు మార్చి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.. సంబంధిత అధికారులు తేల్చాల్సి వుంది.


పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం అక్రమ రవాణా (ఫైల్ ఫోటో)

నాణ్యత లేదని నమ్మించి..

పేద ప్రజలకు నాణ్యమైన రేషన్ బియ్యం ప్రభుత్వం అందిస్తున్న అందులో నాణ్యత లేదని పేద ప్రజలను నమ్మించి వారి వద్ద నుండి రేషన్ బియ్యాన్ని సేకరించి అదే బియ్యాన్ని పాలిష్ చేసి తిరిగి మార్కెట్లో అంతకు నాలుగింతల ధరకు అమ్ముతూ జల్సాలకు, వ్యసనాలకు అలవాటు పడిన ఈ రేషన్ మాఫియా కార్యకలాపాలకు అడ్డుకోవాల్సిన బాధ్యత అధికారులపై వుంది.

యువకులకు డబ్బు ఆశచూపి బియ్యం సేకరణ

అభం శుభం తెలియని కొంతమంది యువకులకు ఆయా గ్రామాలలో, ప్రాంతాలలో డబ్బు ఆశ చూపి వారి ద్వారా రేషన్ బియ్యాన్ని సేకరిస్తూ అక్కడి నుండి పాలిష్ చేసే ప్రాంతానికి తరలిస్తూ అధిక ధరలకు అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులకు మరిన్ని అధికారులు ఇచ్చి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ మాఫియా అడ్డుకట్ట వేయవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

అధికారుల చర్యలే కీలకం?

గత ఐదు సంవత్సరాలలో జరిగిన అక్రమ రవాణాను అడ్డుకున్నట్లే ఈ ఐదు సంవత్సరాలలోనూ సాగే అక్రమ రవాణాను అడ్డుకుని అర్హులైన లబ్ధిదారులకు రేషన్ బియ్యం నాణ్యతపై అవగాహన కల్పిస్తూ అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో ఎదురు చూడాల్సి వుందని నియోజకవర్గ ప్రజలు పేర్కొంటున్నారు.

అప్రమత్తత అవసరం

' సైబర్ నేరాలు -అవగాహన' సదస్సులో సైబర్ క్రైమ్ అధికారి నరసింహారావు


సైబర్ క్రైమ్ అధికారి నరసింహారావును సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: డిజిటల్ నెట్వర్కింగ్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి సైబర్ క్రైమ్ అధికారి నరసింహారావు పేర్కొన్నారు. పుత్తూరు డిఎస్పి జి రవికుమార్ ఆధ్వర్యంలో నారాయణవనం సమీపంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ అధికారి నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్నెట్ జీవితంలోని అన్ని అంశాలను తాకుతోందని, అదే సమయంలో సైబర్ దాడులు పెరిగిపోవడం ఆందోళనకరమన్నారు. ఈ నేపథ్యంలో డిజిటల్ జీవితాలను నిర్వహించడంలో చిన్న లోపం చోటు చేసుకుంటే సైబర్ నేరగాళ్లకు అవకాశం ఇచ్చినట్లే అవుతుందన్నారు. ముఖ్యంగా ఆన్లైన్ తరగతుల్లో కనిపించే సైబర్ నేరాలు గేమింగ్, సోషల్ మీడియాలో కంటెంట్ను అప్లోడ్ చేయడం, షాపింగ్ వెబ్సైట్లు, ఫేక్ న్యూస్, డేటింగ్ యాప్లు పట్ల అప్రమత్తంగా ఉండకపోతే మోసానికి గురయ్యే ప్రమాదం వుందన్నారు. అందువల్ల సైబర్ సెక్యూరిటీపై సమాజంలోని అన్ని వర్గాల వారికి అవగాహన అవసరమన్నారు. నెట్ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, హాట్స్టార్ మొదలైన వినోదం కోసం తమ మొబైల్ ఫోన్లు ఓవర్ ది టాప్ ప్లాట్ ఫారమ్లను యాక్సెస్ చేసే వారందరికీ మరింత అవగాహన పెంచు కోవాలన్నారు. పుత్తూరు డిఎస్పి రవి కుమార్ మాట్లాడుతూ మహిళలు వేధింపు లకు గురి అవుతున్నా, సైబర్ ప్రమాదంలో పడ్డ తక్షణమే సైబర్ క్రైమ్ వెబ్సైట్లో ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. 1930 టోల్ ఫ్రీ నెంబర్కూ కాల్ చేసి సమాచారాన్ని అందిస్తే సమీప పోలీసులు సంఘటన స్థలానికి వెంటనే వెళ్లి పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు సురేంద్ర నాయుడు, పుత్తూరు అర్బన్ సిఐ జి రవీంద్ర, నారాయణవనం, పిచ్చాటూరు ఎస్ఐలు కె రాజశేఖర్, వెంకటేశ్వర్లు పీస్ సైబర్ ల్యాబ్ సిబ్బంది, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

15 వరకు తపాలా శాఖ ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో ఐపీపీబీ ఖాతాలు తెరిచేందుకు, ఎన్పిసిఐ యాక్టివేషన్ కోసం ఈ నెల 15వ తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని పుత్తూరు సబ్ డివిజన్ తపాలా ఇన్స్పెక్టర్ సతీష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమచేయనుందని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ రాష్ట్ర ప్రభుత్వ సామాజిక ప్రయోజనాలు పొందేందుకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డీబీటీ) లబ్ధిదారుల బ్యాంకు, తపాలా ఖాతాలకు తప్పని సరిగా ఎన్సిపిఐ లింక్ కలిగి ఉండాలన్నారు. పుత్తూరు సబ్ డివిజన్ పధిలో పుత్తూరు, నగరి, విజయపురం, నింద్ర, పిచ్చాటూరు, నాగలాపురం, నారాయణవనం, కార్వేటినగరం, వడమాలపేట మండలాలలో 22,127 మంది తమ ఖాతాలకు ఎన్సిపిఐ మ్యాపింగ్, ఆధార్ అనుసంధానం కాకపోవడం వల్ల వారికి సంక్షేమ పథకాలు అందే అవకాశాలు లేవన్నారు. ఎన్పీసీఐ యాక్టివేషన్కు సంబంధించి తపాలా శాఖలో ఖాతా ఉంటే వెంటనే లింక్ చేయించుకోవాలని, ఖాతా లేనివారు ఆధార్ నంబరుతో సమీపంలోని తపాలా కార్యాలయంలో ఖాతా తెరిస్తే మూడు రోజుల్లో ఎన్పిసిఐ యాక్టివేషన్ అవుతుందన్నారు. దీనికోసం తపాలా కార్యాలయాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి: సిసిజె రాఘవేంద్ర



మాట్లాడుతున్న సిసిజె రాఘవేంద్ర

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యార్థిని విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర అన్నారు. శనివారం న్యాయ సేవ దినోత్సవాన్ని పురస్కరించుకొని పుత్తూరు హిమజ డిగ్రీ కళాశాలలో లీగల్ సర్వీస్ డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్స్ సివిల్ జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని. ట్రాఫిక్ నియంత్రణ పాటించాలని, మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు బానిస కాకూడదదన్నారు. సీనియర్, జూనియర్ భేదాలు లేకుండా ర్యాగింగుకు పాల్పడకుండా ఐకమత్యంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్కు పాల్పడితే కఠిన శిక్ష వుంటుందని, మీ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. విద్యార్థులు ఫేస్బుక్, ఆన్లైన్లో చాటింగ్ చేయడం వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వం నిబంధనలు లేకుండా ప్రైవేటు విద్యాసంస్థలకు విద్యాశాఖ అనుమతులు ఇస్తోందని, అలాంటివి లేకుండా చూసుకోవాలని కోరారు. అగ్నిమాపక శాఖ వారు పాఠశాలకు వెళ్లేందుకు వాహనానికి దారి లేకపోయినా ఫైర్కు అనుమతులు ఇస్తున్నారని అలాంటి వాటిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు విధులు సక్రమంగా నిర్వహించ పోవడం వల్ల ప్రమాదాలకు జరుగుతు న్నాయని వాటిపై శ్రద్ధ వహించా లని, లేకుంటే చర్యలు ఉంటాయని హెచ్చ రించా రు. హిమజ కళాశాల ఛైర్మన్ ఎం సురేంద్ర రాజు మాట్లాడుతూ అధికారులు తమ విధులు సక్రమంగా నిర్వహించక పోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవు తున్నాయని దీనిపై న్యాయమూర్తులు సలహా లు ఇవ్వాలని కోరారు. పట్టణంలో ఉదయం సాయంత్రం ట్రాఫిక్ నియంత్రణ ఎక్కువగా ఉండడంవల్ల విద్యార్థులకు సకాలంలో పాఠశాలకు రాలేకపోతున్నారని పోలీస్ శాఖ వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడిపే వారికి తప్పని సరిగా లైసెన్స్ ఉండాలని లేని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే పురుషోత్తం, మురుగేషన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు అనేక చట్టాలు ఉన్నాయని వాటిని సక్రమంగా వినియోగించ పోతున్నారన్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లి అధ్యాపకులు చెప్పిన పాఠాలను సక్రమంగా విని వాటిని నడుచుకునేవారు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ ఓబులేష్. న్యాయవాదులు కోర్టు సిబ్బందులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ స్కూల్ గేమ్స్ పోటీలకు శ్రీ ప్రగతి విద్యానికేతన్ విద్యార్థిని


నిష్ఠితను సన్మానిస్తున్న పసుపులేటి కిషోర్

ప్రజాశక్తి -కోట : ఈ నెల 3,4,5 తేదీలలో మన్యం జిల్లా జోగింపేట గురుకుల పాఠశాల ఆవరణలో జరిగిన 68 వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి ఆర్చరీ(విలువిద్య)పోటీలలో శ్రీ ప్రగతి విద్యా నికేతన్ లో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థిని డి నిష్ఠిత అండర్-14 రికర్వ్ క్రీడా విభాగంలో సిల్వర్ ,బ్రాంజ్ మెడల్స్ సాధించి అర్చరీ జాతీయ పోటీలకు ఎంపికైందని శ్రీ ప్రగతి విద్యా నికేతన్ పాఠశాల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ తెలిపారు. ఈ జాతీయ పోటీలు గుజరాత్లోని నాదియాద్ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఈ నెల 14 వ తేదీ నుండి 20 వ తేదీ వరకు నిర్వహిస్తారని పసుపులేటి కిషోర్ తెలిపారు. అనంతరం ఎంపిక అయినా విద్యార్థి నిష్ఠిత జాతీయ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని ఆర్చరీ కోచ్ టి శివశంకర్ అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సహపాటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూ రు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గూడూరు పట్టణం లోని ఏరియా ఆస్పత్రిలో గర్భిణు లకు పౌష్టి కాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు ఎల్ఐసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవికుమార్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ షరీనా, రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గతంలో తాను గూడూరు ఎల్ఐసి లో పనిచేసేటప్పుడు జన విజ్ఞాన వేదిక బాధ్యతలు తీసుకుని అక్షరాస్యతా కార్యక్ర మాలు, బడిబాట వంటి వాటిని నిర్వహిం చామని తెలిపారు. ఈ నెలలో తమ పాప పుట్టినరోజు సందర్భంగా గర్భిణులకు భోజనాలు పంపిణీ చేసే అవకాశం కల్పించిన జెవివి వారికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. అనంతరం గర్భిణులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, ప్రభాకర్, రాధయ్య, గుర్రం విజయబాబు, అశోక్, సుబ్బారావు, జగదీష్, శ్రీనివాసచారి, సాయి పాల్గొన్నారు.

ఘనంగా చెవిరెడ్డి జన్మదినం


అభిమానుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న చెవిరెడ్డి

ప్రజాశక్తి -రామచంద్రపురం: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలో చంద్రగి రి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర వైసిపి ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహిం చారు. శనివారం ఉదయం 7గంటల నుంచే పార్టీ నాయకులు, కార్యకర్తలు చెవిరెడ్డి జన్మదినాన్ని పురస్క రించుకుని ఆయన ఇంటికి క్యూ కట్టారు. పుష్ప గుచ్చాలు, శాలువలు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తమ వెంట తీసుకొచ్చి ఆయనకు కానుకగా ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చంద్రగిరి నియోజక వర్గంతో పాటు తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చెవిరెడ్డి ఇంటికి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్ లు, మాజీ ఎంపీపీలు, సర్పంచ్ లు అందరూ చెవిరెడ్డిని కలుసుకుని భవిష్యత్తులో మంచి చేకూరాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు చెప్పారు. చెవిరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వంద కేజీల భారీ కేక్ ను బహుమతిగా తీసుకు వచ్చిన అభిమానులు ఆయనతో పాటు కుటుంబ సభ్యులు అందరినీ వేదికపైకి తీసుకువచ్చి కట్ చేయించారు. ఆలయాల్లో పూజలు చేసి ఆశ్రమాల్లో దుస్తులు పంపిణీ చేశారు. శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి వచ్చిన వేద పండితులు చెవిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు అందరినీ వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అంతకు ముందు చెవిరెడ్డి దంపతులు శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ శక్తి చాముండేశ్వరీ దేవి, శ్రీ ఆంజినేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఎప్పటిలాగానే చెవిరెడ్డి తన రాజకీయ గురువు భూమన కరుణాకర్ రెడ్డి ఆశీస్సులు తీసుకున్నారు.

క్రైం న్యూస్

అక్రమ గ్రావెల్ రవాణా టిప్పర్లకు జరిమానా

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం మదనంబేడు గ్రామానికి సమీపంలో క్వారీ నుంచి అక్రమంగా తరలిపోతున్న ఐదు గ్రావెల్ టిప్పర్లకు జిల్లా మైన్స్, మోటార్ వెహికల్ శాఖ అధికారులు ఐదు లక్షల 20వేల రూపాయలు జరిమానా విధించినట్లు స్థానిక ఎస్ఐ రామస్వామి పేర్కొన్నారు. నవంబర్ 4వ తేదీన ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో పోలీసు బృందం సత్యవేడు -ఊతుకోట ప్రధాన రోడ్డు మార్గంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఐదు గ్రావెల్ టిప్పర్లను ఆపి రికార్డులు పరిశీలించారు. గ్రావెల్ తరలింపునకు సంబంధించిన రికార్డులు సక్రమంగా లేకపోవడాన్ని ఎస్ఐ రామస్వామి గుర్తించారు. ఈ నేపథ్యంలో సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి నివేదికను జిల్లా మైన్స్, మోటారు వెహికల్ శాఖ అధికారులకు పంపడంతో శనివారం అక్రమ గ్రావెల్ టిప్పర్లు ఒక్కొక్కటికి ఒక లక్ష 4వేల రూపాయలు జరిమానా విధించినట్లు ఈ సందర్భంగా ఎస్ఐ రామస్వామి వివరించారు. అక్రమ గ్రావెల్ తరలింపును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించే ప్రసక్తి లేదన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఒకరి అరెస్టు


ఫారెస్టు అధికారుల అదుపులో స్మగ్లర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి రైల్వే కోడూరులోని ఎం బావి వద్ద జాతీయ రహదారిలో ఆరు ఎర్రచందనం దుంగలను తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్సు పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాలతో కడప సబ్ కంట్రోల్ కు చెందిన ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ పి నరేష్, అటవీ శాఖకు చెందిన ఎఫ్ బీఓ నాగేశ్వర్ నాయక్ బృందాలు శనివారం ఉదయం తిరుపతి-కడప జాతీయ రహదారిలో రెడ్డిపల్లి చెరువు సమీపంలో వాహనాలు తనిఖీలు చేపట్టారన్నారు. తనిఖీలను చూసి, ఒక కారులోని ఇద్దరు వ్యక్తులు దిగి పారిపోవడానికి ప్రయత్నించగా టాస్క్ ఫోర్సు పోలీసులు ఒకరిని పట్టుకున్నారు. అతనిని కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో ఎస్ఐ సిహెచ్ రఫి కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

ఆగి ఉన్న కంటైనర్ను ఢీకొన్న కారు

ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: ఆగి ఉన్న కంటైనర్ ను కారు ఢీ కొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి మదనపల్లి-నాయుడుపేట జాతీయ రహదారి ఊరందూరు ఫ్లై ఓవర్ పై చోటు చేసుకుంది. రూరల్ సీఐ రవి నాయక్ కథనం మేరకు..బాపట్ల జిల్లా బల్లికురువ మండలం వైదన గ్రామానికి చెందిన ముత్యాల వీరాంజనేయులు(50) శుక్రవారం రాత్రి మారుతి షిఫ్ట్ కారులో తన స్నేహితులతో కలిసి బెంగళూరు బయలుదేరాడు. ఈ క్రమంలో ఊరందూరు ఫ్లై ఓవర్ వద్ద ఆగి ఉన్న ట్యాంకర్ ను వెనకనుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో వీరాంజనేయులు అక్కడికక్కడే మృతిచెందగా, ఆయన స్నేహితులు రంగారావు(52), కృష్ణమూర్తి(53) తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హైవే పెట్రోలింగ్ పోలీసులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ కి తరలించారు. వీరిలో రంగారావు పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు వైద్యులు రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు చేయూత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఐదు వేల రూపాయలు విలువ చేసే ఫ్లోర్ మేట్స్ను అందించారు. పూర్వ విద్యార్థులు వాకాటి రామ్మోహన్, పసుపులేటి ప్రసాద్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి, పీడీ శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి చేతి బోరుకు మరమ్మతులు


బోరు చుట్టూ ప్లాట్ఫామ్ ఏర్పాటు చేసిన కార్తీక్నాయుడు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కారణమెట్ట ఎస్సి కాలనీలో ఓ తాగునీటి బోరుకు సర్పంచ్ కుమారుడు కార్తీక్ నాయుడు సొంత నిధులతో చుట్టూ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేశారు. గతంలో తాగనీటి బోరును బిగించారు. ప్రస్తుతం బోరు చుట్టూ ప్లాట్ ఫామ్ నిర్మించకుండా వదిలేయడంతో మురికి నీరు చేరి చుట్టూ పిచ్చి మొక్కలు నిండి అపరిశుభ్రంగా మారింది. ఈ దుస్థితిని చూసిన సర్పంచ్ కుమా రుడు కార్తీక్ నాయుడు వెంటనే తన సొంత నిధులతో ఎస్సి కాలనీ వాసుల కష్టాలు తెలుసుకుని చేతి పంపు చుట్టూ ప్లాట్ఫామ్ ఏర్పాటు చేశారు. ఆ దారిలో అటుఇటు వచ్చి వెళ్లే వారు బోరును కొట్టడం అక్కడ నీరు చేరి బురదమయమై దోమలు వ్యాపించాయని, దీన్ని గమనించి కార్తీక్ నాయుడు ఆ చేతి పంపు చుట్టూ బ్లీచింగ్ చల్లించి శుభ్రం చేయించారని తెలిపారు. దీన్ని చూసి కాలనీ వాసులు సర్పంచ్కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు లోని ఓం సాయిరాం చారి టీస్ వృద్ధాశ్రమంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం నిర్వహిం చారు. మెడనూరు సురే ష్ రెడ్డి, శాంతి దంపతు లు ఆర్థిక సాయంతో ఈ కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భం గా క్లబ్ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడం లోనే సంతృప్తి వుంటుందన్నారు. యువత సేవా కార్యక్రమాల పై దృష్టి సారించా లన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు శ్రీనివాసులు, రాధయ్య, రాము, కెఆర్ఎం, మురళీ నాయుడు, ప్రభాకర్, నాగరాజు, కృష్ణారెడ్డి , మునిప్రసాద్ , శ్రీ హరి, వాకటి శ్రీనివాసులు, కళ్యాణి పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

68వ రాష్ట్రస్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-భోగాపురం, (విజయనగరం జిల్లా)

స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు శనివారం విజయనగరం జిల్లా భోగాపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికగా 26 బాల బాలికల జట్లు, మూడు రోజులపాటు నిర్వహించే ఈ రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యాయి.జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఈపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గొప్ప క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. క్రీడల్లో రాణించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు, ఎంతో శ్రమ, పట్టుదల, ఓర్పు ఉండాలని సూచించారు. పోటీల్లో రాణించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. తద్వారా తమ జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతులు సముపార్జించాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీలకు మన జిల్లా ఆతిథ్యం ఇవ్వడం ఆనందదాయకంగా ఉందని, ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖను అభినందించారు. పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన బాల బాలికలకు అన్ని వసతులు కల్పించాలని, క్రీడలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.



జిల్లా విద్యాశాఖ అధికారి మాణిక్యం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు చదువులతోపాటు క్రీడలు కూడా ఒక భాగమని పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం విద్యా బోధన తో పాటు క్రీడా పోటీల నిర్వహణ కూడా ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలని కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఐపిఇ జి.భానుమూర్తి రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాల క్రీడా పోటీల నిర్వహణకు ఈ ఏడాది ప్రభుత్వం సుమారు రూ.7.4 కోట్లను మంజూరు చేయడం విశేషమని పేర్కొన్నారు. క్రీడలకు, క్రీడాకారులకు గొప్ప భవిష్యత్తు ఉందని, ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఉద్యోగ నియామకాల్లో ఇస్తున్న రిజర్వేషన్ ను రెండు నుంచి మూడు శాతానికి పెంచిందని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ నైపుణ్యం ఉన్న క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన 12 మంది బాలురను, మరో 12 మంది బాలికలను డిసెంబర్లో వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారని తెలిపారు. ముందుగా జిల్లా కలెక్టర్ అంబేద్కర్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఫ్లాగ్ మార్చ్ తిలకించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. పోటీలకు హాజరైన బాల బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భోగాపురం కేజీబీవీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది.

కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ కె.వెంకటరమణ, ఎంఇఒ బి. చంద్రమౌళి, పాఠశాల హెచ్ఎం పిఎజిహెచ్ శ్రీనివాసరావు, ఇఎపిఆర్‌డి గాయత్రి, రాష్ట్ర వాలీబాల్ సంఘ కార్యదర్శి భగవాన్‌దాస్, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల పరిశీలకులు చంద్ర వర్మ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కెవిఎల్ఎన్ రాజు, దెందేరు పాఠశాల హెచ్ఎం సునీత, కె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు రాష్ట్రవ్యాప్తంగా 104 ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులు ధర్నా, ఒకరోజు నిరసన దీక్షను జయప్రదం చేయాలని తిరుపతి జిల్లా 104 ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు టి.రామకృష్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి యస్. జయచంద్ర, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తిరుపతి సిఐటియు జిల్లా కార్యాలయంలో 104 ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో 104 ఉద్యోగులు గత 16 సంవత్సరాల నుండి ప్రజలకు సేవలు అందిస్తున్నారని, గతంలో ప్రభుత్వం ఆధీనంలో పనిచేస్తున్న 104 ఉద్యోగులను వైసీపీ ప్రభుత్వం అరబిందో యాజమాన్యంకు అప్పగించిందన్నారు. 104 సర్వీసులను ప్రభుత్వం గతంలో మాదిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని, గత మూడు సంవత్సరాల నుండి యాజమాన్యం నిర్లక్ష్యంగా వెయ్యని ఇంక్రిమెంట్లు అరియర్స్ రూపంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 104 అధ్యక్షులు పి.అమర్నాథ్, ప్రధాన కార్యదర్శి బత్తిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీమోహన్, యోగానంద, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కుంటలో చేపలు మృత్యువాత

ప్రజాశక్తి - రామచంద్రాపురం



బలిజపల్లి గ్రామానికి చెందిన కరుణ అనే రైతు తన పొలంలో రెండు కుంటలను ఏర్పాటు చేసుకుని చేపల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఒక్కో కుంటలో 30 వేల చేప పిల్లలను వదిలి పెంచుతున్నాడు. అయితే తిరుపతికి చెందిన వేలూరు మురళి అనే వ్యక్తి తమ చేపల పెంపకం కుంటల వద్దకు వచ్చి పరిశీలించి చేపల కుంటలను లీజుకి ఇవ్వాలని చేపల పెంపకపుదారుడు కరుణను అడిగాడు. అందుకు కరుణ ఒప్పుకోలేదు. శుక్రవారం సాయంత్రం కుంటలో చేపలకు ఆహారం (ఫీడ్) ఇచ్చి కరుణ ఇంటికి వెళ్లాడు. అయితే తెల్లారేసరికి చేపలన్నీ మృత్యువాత పడ్డాయి. చేపలు, కప్పలు, పాములు చనిపోయి నీటితో తేలియాడుతూ కనిపించాయి. అయితే ఏమైనా విషప్రయోగం జరిగిందా? ఆక్సిజన్ అందక చేపలు మృత్యువాత పడ్డాయా అన్నది విచారణలో తేలాల్సి ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

16 నుంచి జీతెలుగులో సరిగమప

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

విజయవంతంగా కొనసాగుతున్న జీ తెలుగు సింగింగ్ షో సరిగమప సీజన్ 16 – ది నెక్స్ట్ సింగింగ్ యూత్ ఐకాన్ ప్రత్యేక ఎపిసోడ్స్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైనట్లు జిల్లా జీ తెలుగు నెట్వర్క్ ప్రతినిధులు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రారంభం నుంచీ తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మ్యూజికల్ రియాలిటీ షో సరిగమప సీజన్ 16 నవంబర్ 10 నుండి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి 10 గంటల వరకు ప్రసారం కానుంది. ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ సీజన్కి సంగీత దిగ్గజాలు కోటి, ఎస్పీ శైలజ, కాసర్ల శ్యామ్లు ఈ సీజన్ ఉత్తేజకరమైన ప్రదర్శనలు, మనసును హత్తుకునే పాటలతో సంగీత ప్రియులకు మరింత వినోదం పంచబోతోంది.

'హాథీరామ్ బావాజీ ఆలయాన్ని నిర్మించాలి'

తిరుపతి టౌన్ : ఢిల్లీ నేషనల్ కమిషన్ ఎస్టి మెంబర్ జటావత్ హుస్సేన్ నాయక్‌ను ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ చక్రి నాయక్, తిరుపతి జిల్లా అధ్యక్షులు బుక్యా శివా నాయక్, జనరల్ సెక్రెటరీ హరిబాబు నాయక్, జటావత్ రాంబాబు నాయక్, కాలే నాయక్, రామంజి నాయక్ తదితరులు పాల్గొని హాథీరామ్ బావాజీ ఆలయ నిర్మాణం గురించి మాట్లాడి ఆ సమస్యను పరిష్కరించాలంటూ వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం: కూటమి ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం సాధ్యమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శనివారం మండలంలోని గంగిరెడ్డి పల్లి రైతు సేవా కేంద్రంలో వేరు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల కష్టాలు తెలుసుకుని రబీ సీజన్లో పంటలు సాగు చేసుకు నేందుకు వేరుశనగ విత్తనాలను సకాలంలో అందిస్తున్నారన్నారు. మామిడి రైతుల కోసం జిప్సం, సల్ఫేట్లు కూడా రైతు సేవా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వి నియోగం చేసుకోవాలన్నారు. రామచంద్రపురం మండలానికి 360 క్వింటాల వేరుశనగ విత్తనాలు ప్రభుత్వం తరపున చేసిందని వ్యవసాయ అధికారిని స్రవంతి



తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం టిడిపి అధికార ప్రతినిధి ఎం చిన్నబాబు. జనార్దన్ చౌదరి, ఏం ఢిల్లీనాథరెడ్డి, పి బాబు యాదవ్, పూజారి సుబ్రహ్మణ్యం యాదవ్, పి విజయ్ కుమార్, బాదురు ధనంజయులు, టి చిరంజీవి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు మునేయ్య, సి రవికుమార్, ధనంజయ రెడ్డి, గరుడాద్రి నాయుడు, కోరా హరి ప్రసాద్, మండల స్థాయి అధికారులు, రైతులు, మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీ కాలనీలో బ్రాందీషాపు వద్దు : ఐద్వా

ప్రజాశక్తి - రేణిగుంట: తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ రాజీవ్‌గాంధీ కాలనీలో పెట్టిన వైన్‌షాపు వల్ల మహిళలకు, పిల్లలకు రక్షణ లేదని, జనసంచారం ఉండే ప్రాంతాల్లో శాంతిభద్రతలకు ఇబ్బందని ఐద్వా నాయకులు సత్యశ్రీ, లక్ష్మి అన్నారు. చుట్టుపక్కల నివాసం ఉంటున్న మహిళలతో కలిసి ఐద్వా ఆధ్వర్యంలో శనివారం తిరుపతి ఎక్సైజ్ సిఐ నరసానాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. మహిళల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో వేరే ప్రాంతానికి ఆ షాపును మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలోసిపిఎం నాయకులు సెల్వరాజ్, మహిళలు సుబ్బలక్ష్మి, సుశీలమ్మ, దేశమ్మ, మణి, తులసి, బాలయ్య, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఓం నారాయణ స్కూలు సమీపంలో షాపు వద్దు

ప్రజాశక్తి - ఏర్పేడు: ఓం నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూలు పక్కనే కోటాక మార్గంలో గతంలో వైన్‌షాపు ఉండేది. నిత్యం ఈ ప్రాంతంలో విద్యార్థులు సంచరిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో గతంలో అనేకమార్లు వైన్‌షాపును తొలగించాలని స్కూలు కరస్పాండెంట్ కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్‌కు, గత నెల అక్టోబర్ 11న శ్రీకాళహస్తి ఎక్సైజ్ సిఐకి కంప్లైంట్ ఇచ్చారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని స్కూలు సమీపంలో వైన్‌షాపు పెట్టకుండా చూడాలని మరోసారి కరస్పాండెంట్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

ఘనంగా నల్లపరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -కోట : టిడిపి సీనియర్ నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు వారి స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. శనివారం కోట మండలం లోని నల్లపరెడ్డి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో కేశవరం పంచాయతీ సీనియర్ నాయకులు శ్రీరామ్



గురుస్వామి, చిట్టేడు సొసైటీ మాజీ చైర్మన్ ఉలవ కాయల ప్రసాద్, టీడీపీ బీసీ నాయకులు శ్రీరామ్ సుధాకర్, పుట్టా వీరరాఘవులు, కేశవరం ఉప సర్పంచ్ ముమ్మడి సుబ్బయ్య, విగ్రహాల రఘురామయ్య పాల్గొని గజమాలతో ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మోహన్ నాయుడుకు ఉత్తమ అధ్యాపక అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగాధిపతి డాక్టర్ గుట్టపల్లి మోహన్ నాయుడు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపిక అయ్యారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తరపున రాష్ట్ర స్థాయిలోని విశ్వవిద్యాలయాల ఉత్తమ అధ్యాపకుల అవార్డుల జాబితాలో ఆయన చోటు లభించింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఆయన గత 24



సంవత్సరాలుగా గణాంక శాస్త్రాన్ని బోధిస్తున్నారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం పరిధిలోని దాదాపు 94 మంది పి.జి, పి హెచ్.డి విద్యార్థు లకు ఆయన మార్గదర్శకులుగా వ్యవహరించారు. 2013లో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉత్తమ అధ్యాపక అవార్డును ఆయన అందుకున్నారు. ఈ నెల 11న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకో నున్నారు.

ఎస్వీయూలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జన్మదినం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వేదికగా



చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం వైఎస్ఆర్ విద్యార్థి విభాగం ఎస్వీయూ అధ్యక్షులు మస్తాన్ ప్రేమ్ ఆధ్వర్యంలో వర్సిటీ పరిపాలన భవనం వద్ద బాణసంచా పేల్చి కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,ముని, నరేష్,హరి , రాకేష్, యశ్వంత్ ,సాయి , దినేష్, లికిత, రాకేష్, వెంగళరావు, మధు, నిఖిల్ పాల్గొన్నారు.

గత ప్రభుత్వ చేతకాని తనం వల్లే సమస్యలు: మంత్రి

ప్రజాశక్తి- చంద్రగిరి: ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలం గత వైసిపి ప్రభుత్వం చేతగాని తనమేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొల్లు పార్థసారథి అన్నారు.చంద్రగిరి మండలం, తొండవాడ హౌసింగ్ కాలనీ లబ్ధిదారులతో సమస్యలను సమీక్షించటానికి మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్ శనివారం సమావేశమయ్యారు. కాలనీకి వచ్చిన మంత్రి, ఎమ్మెల్యేలకు స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. ముందుగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. కాలువలు, వీధి లైట్లు, రోడ్లు,రేషన్ షాపు, డ్రైనేజీ సమస్యలను కాలనీ వాసులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మంత్రి పార్థసారథి మాట్లాడుతూ గత వైసిపి పాలకులు రాష్ట్రాన్ని పూర్తిగా అధోగతి పాలు చేసి, అభివృద్ధికి ఆమడ దూరంగా నెట్టేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 10.5 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి, ఆ భారాన్ని టిడిపి ప్రభుత్వం పై పెట్టేశారని మండిపడ్డారు. కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆరు నెలల్లో తానే వచ్చి అభివృద్ధి పనులు ప్రారంభిస్తానని మంత్రి ప్రకటించారు. ఈ సమావేశంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, హౌసింగ్, ఇతర శాఖల అధికారులు, స్థానిక కూటమి పార్టీల నాయకులు, మహిళలు కాలనీ వాసులు , యువత పాల్గొన్నారు.